కేయాస్ కథ




వేం మాట్లాడుకోటం ఇంకా పూర్తి కాకుండానే శంకరంబాబుగారొచ్చారు దేవుడల్లే.

"శంకరంబాబుగారొచ్చారు!" అన్నాడు భద్రం.

"దేవుడల్లే," అన్నాను.

"ఏమిటి కథ?" అనడిగారు శంకరంబాబు.

"నన్ను చెప్పనీ, భద్రం" అన్నాను భద్రంకేసి తీక్షణంగా చూసి.

"నువే చెప్పు, గురో. ఎవరు చెప్పినా యిసయ వొకటేగా," అన్నాడు భద్రం, కొత్తగా వచ్చిన కొత్తసినీమాపత్రిక ఆడబొమ్మలదగ్గిర తెరుస్తూ.

"చూడు, శంకరంబాబూ. ఈ డిటెక్టివపని ఏవీ గిట్టుబాటుగాలేవు. ఇప్పుడు అంతకులు బయరంగంగానే అత్యాచారాలు చేస్తున్నారు, నువు డిటెక్టివ జేసేదేం టంటున్నాడు భద్రం."

"అదీ నిజమే, కేయాస్. ఈమధ్య నువు డిటెక్టివు క్లబ్బుకేసి వెళ్ళావా?"

"కిందటేడుగామా వెళ్ళాను, శంకరంబాబూ."

"డిటెక్టివు లెవరన్నా కనిపించారా?"

"క్లబ్బు తాళం పెట్టుంది."

"దాన్నిబట్టి ఏం గ్రహించావు?"


"క్లబ్బులో డిటెక్టివు లెవరూ లేరని కనిపెట్టాను."

"భేష్. ఇంకోటికూడా నువు కనిపెట్టి ఉండవచ్చు."

"అదేంటి శంకరంబాబూ?"

"డిటెక్టివు లందర్నీ క్లబ్బులో పెట్టి ఎవరైనా బయట తాళం పెట్టి ఉండవచ్చు."

*కొడవటిగంటి కుటుంబరావు*




"హాత్తెరీ!" అన్నాడు భద్రం. వాడింకా అమ్మాయిల బొమ్మలే చూస్తున్నాడు. మా సంభాషణలో వాడు పాలు కొనటం లేదు.

"నీ తెలివి అమోహం, శంకరం బాబూ," అన్నాను.

"చూడు, కేయాస్! డిటెక్టివుల కాలం వెళ్ళిపోయింది. నే నన్నట్టు డిటెక్టివులందరినీ ఆ క్లబ్బులో పెట్టి ఎవరో తాళమే పెట్టారనుకో. అప్పుడా క్లబ్బుకు నిప్పు పెట్టేవాడు మొనగాడు. ఇప్పుడు వాళ్ళదే రాజ్యం," అన్నాడు శంకరం బాబు.

"డిటెక్టివుగాళ్ళ నందరినీ చంపెయ్యటమే?" అన్నాను ఆశ్చర్యంగా.

"వాళ్లెప్పుడో చచ్చారు. ఆ క్లబ్బులో డిటెక్టివులంటూ ఉంటే అవి వాళ్ళశవాలే అనుకో. ఏదైనా, మనుష్యులను లోపల పెట్టి ఇళ్ళ(టించేవాడే ఈనాడు హీరో. వాణ్ణేమంటారో తెలుసా?"

"ఏమంటారు, శంకరంబాబూ?"

"గూఢచారి."

"ఎక్కడో విన్నట్టే ఉంది మాట."

"వినటమేమిటి? లోకమంతా ఆ మాట జపిస్తుంటే! గూఢచార్ల మీద నెలకు రెండుబళ్ళ పుస్తకాలూ, ఇరవై బళ్ళ సినిమాలూ వస్తున్నాయి. నువ్వు కీర్తి సంపాదించాలంటే గూఢచారివై పో," అన్నాడు శంకరంబాబు.

గూఢాచారి! ఆలోచిస్తున్నాను. భద్రం

ఎరిగున్నవాళ్ల లో ఇద్దరు చారిగాళ్లున్నారు. తస్సదియ్యా, వాళ్లు గూఢాచార్లే అయ్యుండాలి. భద్రం నాతో వాళ్ళనుగురించి ఎన్నడూ చెప్పాడేకాడు. ఇంత చచ్చు అసిస్టెంటుతో నే నేం పైకొస్తాను?

"శంకరంబాబూ! ఈ గూఢా చారి కామామీషంతా అరటిపం డొలిచినట్టు నాకు చెప్పేయ్యండి. నేను కూడా ఓచారీ అయిపోతాను," అన్నాను.

"గూఢచారి అనేవాడు అయిదు పిస్తోళ్ళూ, అయిదు కత్తులూ, పది పది హేను లక్షల రూపాయిలూ వెంట బెట్టుకు తిరుగుతాడు. వాడికి విమానాల్లో టిక్కెట్టు లేకుండా ప్రయాణాలు! పెద్ద పెద్ద హోటళ్ళలో బస! రోల్స్ రాయిస్ కార్లలో షికార్లు, అంతా రహస్యం. వా డెవడో ఎవరికీ తెలీదు. ఇవాళ ఇక్కడుంటాడు. రేపు అమెరికాలో ఉంటాడు. ఎల్లుండి రష్యాలో. వాడు చేసేపని ఏమిటని అడుగు ... అన్ని దేశాలకూ గూఢచార్లుంటారు. ఒక దేశపు గూఢచార్లను ఇంకోదేశపు గూఢచార్లు చంపుతూ ఉంటారు. మన దేశంపైకి రావాలనుకో; మనదేశపు గూఢచారి మనకన్న గొప్పదేశపు గూఢచారిని చంపటం అవసరం. యుద్ధాలదేవుంది? బోడియుద్ధాలు? మొన్న జరిగిన యుద్ధంలో మనం కోట్లకొద్దీ చైనావాళ్ళని చంపాం, లక్షలకొద్దీ పాకిస్తానువాళ్ళను చంపాం. దాంతో ఏవీ తేలదు. మాంచి లావాంటి చైనాగూఢచారిని పట్టుకుని ఖతం చేసిన ట్టయితే చైనావాళ్ళు, మాకు కమ్యూనిజం వద్దుబాబో అని సంధి చేసేసుకునేవాళ్ళు. రష్యా ఎందుకు బలంగాఉంది. వారాని కోసారి వాళ్ళ అగ్రనాయకులంతా సమావేశమై జటాయువుల్లాంటి విదేశ గూఢ చారుల్ని ఖతం చెయ్యటానికి కావలసిన తీర్మానాలూ అవీ చేస్తూ ఉంటుంది ... మన డిటెక్టివు క్లబ్బులో ఆర్నెల్లకింద మిలటరీహోటలు పెట్టారు. అందుచేత నువు గూఢచారివైపో."

పహరహవస్యంతో నా కళ్ళు మూతలుపడ్డాయి. నేనొక గూఢాచారిని. విమానాల్లో టిక్కెట్టు లేకుండా రష్యా, అమెరికా, పారిస్, లండన్ అన్నీ తిరిగేస్తున్నాను! నాజేబుల్లో అయిదు పిస్తోళ్ళు! నా బొడ్డులో అయిదు కత్తులు! ఆకాశాన్నంటే ఓటళ్ళలో మకాం!

"అన్నట్టు, గూఢచారికి నంబరుండాలి. గూఢచారి 123, గూఢచారి 456, గూఢచారి 789 – అట్లా."


"నెంబ రెందుకు, శంకరంబాబూ?"

"నంబరే ముఖ్యం. నంబరునుబట్టి ఎటువంటి గూఢచారీ, ఏం చేస్తాడూ, ఏవిటి కథ – అంతా తెలుస్తుంది."

"నా కేదన్నా మంచి నెంబరివ్వు, శంకరంబాబూ."

"మూడు సున్నాలు నీ నెంబరుగా పెట్టుకో."

"మూడు సున్నాల కర్థం?"



మొదటి సున్నా, నువు హత్యలు చెయ్యగలవని; రెండో సున్నా, హత్యలు చేసేవాళ్ళను హత్యలు చెయ్యగలవని; మూడో సున్నా, ఎప్పుడు బడితే అప్పుడు ఎవరిని బడితే వారిని హత్యలు చెయ్యటానికి నీకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని."

"అంటే అత్యచేసినా బొక్కలో వెయ్యరా, శంకరంబాబూ?"

"నిన్ను గూఢచారిగా నియమించే ప్రభుత్వం అరెస్టు చెయ్యదు. పై దేశాల వాళ్ళు నిన్నుపట్టుకున్నా మనవాళ్లు నిన్ను కాపాడటానికి విశ్వప్రయత్నాలుచేస్తారు.


ఆలోచిస్తున్నాను. ఈ గూఢాచారి పని డిటెక్టివ్‌కు పూర్తిగా తలకిందులుగా ఉన్నది. గూఢాచారంటే అంతకుడన్న మాట. డిటెక్టివు కానేకాదు.

"గూఢాచారికి కూడా అసిస్టెంటు ఉంటాడా, శంకరంబాబూ?" అనడిగాను.

"గూఢచారి కెవరూ ఉండరు. వాడిది ఒంటరి జీవితం."

"మరి భద్రం మాటేంటి?"

"ఇటువంటి తుంగభద్రంగాళ్ళు గూఢచారికి రోజు కరడజనుమంది సహాయం చేస్తుంటారు. కాని వెంట ఎవరూ ఉండరు. కావలిస్తే భద్రాన్ని సెక్రటరీగా ఉండనీ. టెలిఫోన్ దగ్గిర కూర్చోవటమే వాడి పని. నీకు పనిపడి నప్పుడల్లా ఆ టెలిఫోనులో పిల్చి పని



చెబుతావు. ఆ టెలిఫోనుకూడా రహస్యపు టెలిఫోను."

భద్రం అసిస్టెంటుగాఉండటం మాని సెక్రటరీ అవుతాడన్నమాట ఎంత చెడ్డా, భద్రం లేందే నేను గూఢాచారి మూడు సున్నాలు కావటం కష్టం.

"నీ ఆఫీసుకూడా ఎవరికీ తెలీ కూడదు. ఏ గొడ్లపాకాలోనో, గడ్డి వామిలోపలో రహస్యంగా గది ఉంటుంది. అందులోనే టెలిఫోనూ, టెలివీజర్, టెలిప్రింటర్, టేప్‌రికార్డర్, రేడార్, ఎలక్ట్రాన్, ప్రోటాన్, పెట్రాన్ అన్నీ ఉంటాయి. పెట్రానుకూ హైట్రానుకూ మధ్య నక్కి భద్రం నీతో రేడారుమీద టెలివిజరులో మాట్లాడుతూంటాడు."

హాశ్చర్యం! హత్యాశ్చర్యం! గూఢా చారిలోకూడా సయించుందన్నమాట.

"అయితే, శంకరంబాబూ. గూఢా చారిలోకూడా సయించుందన్నమాట!"

"కనిపెట్టేశావే!"

"కులూ దొరికితే ఆపాటి తెలుసుకో లేనా, శంకరంబాబూ. ఎంత చెడ్డా, తల దిరిగిన డిటెక్టివుసుగదా!" అన్నాను.

శంకరంబాబు లేచాడు.

"అయితే, బాబూ! నన్ను గూఢాచారి

నెప్పుడు చేస్తారు? నాకు గూఢాచార్యై పోవాలని మహా హతహతగా ఉంది,'' అన్నాను.


"తొందరపడకు. రహస్యడిపార్టు మెంటు రహస్యశాఖలో రహస్యగూఢ చారి అధికారి 22_33_44 తో మాట్లాడి నీకు రహస్య ఆర్డర్లొచ్చేట్టు చూస్తాను - అంతదాకా ఈ పుస్తకాలకట్ట చదువు తూండు," అని శంకరంబాబు 114 పుస్త కాలు చంకలోనించి తీసి బల్లమీదపెట్టి వెళ్ళిపోయాడు.

"భద్రం!" పిలిచాను.

''ఏంటి, గురో?"

"ఈ పుస్తకాలు ఒకొటొకటే రహస్యంగా చదివి నాకు వినిపించు."

"ఒక్క-ఛనం, గురో. ఈ ఒక్క-బొమ్మాచూసేసి_" అంటూ భద్రం ఒక దిసెమొలబొమ్మలో లీనమయాడు.



*